ప్రేమ, శాంతి, సమాధానం కలిగి ఉండాలి

- ఘనంగా ఈస్టర్ వేడుకలు
- కిటకిటలాడిన ప్రార్థనా మందిరాలు
- పూర్వీకులను గుర్తు చేసుకున్న క్రైస్తవులు

దర్శి(కురిచేడు): ఏసుక్రీస్తు పునరుత్థానం చేసిన మహోన్నతమైన రోజు ఈస్టర్ అని, క్రైస్తవులు పునరుత్థాన శక్తితో ఆధ్యాత్మికంగా పునీతులు కావాలని దైవజనులు పేర్కొన్నారు. ఈస్టర్ పండుగను పురస్కరించుకొని మండలంలోని అన్ని గ్రామాల్లోని చర్చిల్లో మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు, ఆరాధనలు నిర్వహించారు. శుభ శుక్రవారం రోజున శిలువ శ్రమను, శిలువ మరణమును అనుభవించి మూడవ దినమైన ఆదివారం రోజున లోక రక్షకుడైన క్రీస్తు పునరుత్థానము అయ్యారని తెలిపారు. ఆయన తన రక్తముతో పాపాలను కడిగి క్షమాగుణాన్ని అందించాడని ఆయన చూపిన శాంతిమార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని కోరారు. నియోజకవర్గంలో ఈస్టర్ దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. దర్శి పట్టణంలోని సియోను ప్రార్థనా మందిరంలో పాస్టర్ గొంగటి జాన్ అధ్యక్షతన ఈస్టర్ దినోత్సవాలు నిర్వహించారు. మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు రెవరెండ్ దేవదానం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రీస్తు వలే ప్రేమ శాంతి, సమాధానం కలిగి ఉండాలని బోధించారు. క్రీస్తు మరణించి తిరిగి మరళా పునరుత్థానుడై లేచారని ఆయన మళ్లీ తిరిగి వచ్చినప్పుడు మనలను కూడా అలాగే లేపుతారని బైబిల్ బోధనలు వినిపించారు.


దొనకొండ: ప్రార్థనల్లో పాల్గొన్న ఏబీఎం సంఘస్తులు

కురిచేడులో..

రోమన్ క్యాథలిక్ చర్చి, ఇండిపెండెంట్ చర్చిలలో ఈస్టర్ ఆరాధన ఘనంగా నిర్వహించారు. దేకనకొండలోని సింగరయ్యకొండపై తెల్లవారు జామున ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఫాదర్ రాయన్న, పాస్టర్ జీ యోనాలు మాట్లాడుతూ ఏసుక్రీస్తు మరణాన్ని సమాధిని గెలిచి మృత్యుంజయుడిగా సమాధిని జయించి జయధశీలుడిగా తన ప్రజల మధ్య నిలిచారన్నారు. ద్వేషం, అసూయ, దౌర్జన్యం, హింసల కన్నా శాంతి, ప్రేమ క్షేమాపణలే సమున్నతమైనవని ఏసు క్రీస్తు రుజువు చేశారన్నారు. కార్యక్రమంలో పాస్టర్‌లు పాల్గొన్నారు.

ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు..

పెద్దదోర్నాల: మండల పరిధిలోని గ్రామాల్లో ఈస్టర్ పర్వదినాన్ని క్రైస్తవులు ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామాల్లో భక్తులు భారీగా ప్రార్థనలు చేసుకునేందుకు చర్చిలకు తరలి రావటంతో భక్తులతో కిక్కిరిశాయి. స్థానిక జీసస్ హీలింగ్ టెంపుల్ చర్చిల్లో జరిగిన ప్రార్థనల్లో పాస్టర్ బుట్టి పాల్ స్వర్జన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా చర్చిలో పాల్గొన్న భక్తులకు పాస్టర్ ప్రత్యేకంగా దీవెనలు అందించారు. మండల కేంద్రంలోని ఇవాంజిలీకల్, లూథరన్, ఏబీఎం, బాప్టిస్టు, క్రీస్తు పిలుస్తున్నాడు తదితర ప్రార్థనా మందిరాల్లో ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.


వైపాలెంలో ర్యాలీ చేస్తున్న విశ్వాసకులు

దొనకొండ మండలంలో..

దొనకొండ: మండలంలోని అన్ని గ్రామాలల్లో ఈస్టర్ పండగను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. శుక్రవారం సిలువ మరణం పొందిన క్రీస్తు ఆదివారం తెల్లవారు జామున పునరుత్థానం పొందారు. ఈ సందర్భంగా పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఈస్టర్ సందేశాన్ని వివరించారు. దొనకొండలోని ఏబీఎం, ఆర్‌సీఎం, సీఎస్ఐ, బెరాకా, కల్వరీ, లూథరన్ తదితర చర్చిలలో క్రైస్తవులు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు.

త్రిపురాంతకంలో..

త్రిపురాంతకం: మండల వ్యాప్తంగా క్రైస్తవులు ఆదివారం ఈస్టర్ పర్వదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. క్రైస్తవులు ఉదయం నుండే ఒకరికి ఒకరు ఈస్టర్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. గ్రామాల్లో తెల్లవారుజాము నుండే ప్రార్థన మందిరాలలో ఈస్టర్ ప్రత్యేక ఆరాధనలు జరుపుకున్నారు. పాస్టర్లు ఏసుక్రీస్తు పునరుత్థాన సందేశాలను అందించారు. తెలుగు బాపిస్టు చర్చిలో పాస్టర్ నానిజాన్, లూథరన్ చర్చిలో పాస్టర్ రవికిరణ్, హెబ్రోన్ చర్చిలో పాస్టర్ జాన్ డగ్లస్, హోలీఫెయిత్ చర్చిలో పాస్టర్ జాన్‌పాల్, బిలివర్స్ చర్చిలో పాస్టర్ శ్యాముల్, ఎల్ఈఎఫ్ చర్చిలో దైవసేవకులు కెఆర్ ప్రసాదరావు ఈస్టర్ ఆరాధన వేడుకలు ఘనంగా నిర్వహించారు.


పెద్దదోర్నాలలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు

యర్రగొండపాలెంలో..

యర్రగొండపాలెం: జీసస్ పునరుత్థానం సందర్భంగా ఆదివారం ఈస్టర్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. లేమెన్స్ ఇవాంజికల్ ఫెలోషిప్ ఇంటర్నేషనల్ చర్చి, తెలుగు బాప్టిస్ చర్చి, హోసన్న మందిరం, క్రీస్తు సంఘం, లూథరన్ చర్చి, ఎఫ్రాత చర్చి, బ్రదర్‌ఇన్ చర్చిలలో పాస్టర్లు ఈస్టర్ పండుగ ప్రాముఖ్యతను వివరించారు. లేమెన్స్ ఇవాంజికల్ చర్చిలో క్రీస్తు పునరుద్ధారణ నాటికను ప్రదర్శించారు. ఆయా చర్చిలలో సన్నెపోగు సుందరరాజు, బొందలపాటి హయ్యర్ జయదేవ్, జాన్సన్ ఫిన్నీ, జాన్ బన్యన్, ఎం.మోజెస్, పరిమి ఏసయ్య, కొర్రపోలు ఇజ్రాయిల్, జయరావ్, సిద్ధల కోటయ్య విశ్వాసకులకు ప్రత్యేక సందేశాన్ని ఇచ్చారు.

ముండ్లమూరు (కురిచేడు): ఏసు చూపిన జాలి, దయ, క్షమా గుణం ప్రతి ఒక్కరూ ఆచరించాలని పాస్టర్ తాతపూడి తెల్లయ్య అన్నారు.ముండ్లమూరులోని కవనెంట్ చర్చి, ఇమ్మానియేలు ప్రార్థనా మందిరం, వేంపాడులోని న్యూ అపోస్తలిక్ చర్చిలో ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాస్టర్‌లు ఇవాంజలిస్టు గండి బెంజిమెన్, తాతపూడి ఏసుదాసు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరం

దర్శి(కురిచేడు): అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని అగ్ని మాపక అధికారి సీహెచ్ జాలయ్య సూచించారు. స్థానిక డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల కళాశాలలో అగ్నిమాపక వారోత్సవ ముగింపు వేడుకలు ఆదివారం జరిగాయి. ఈసందర్భంగా విద్యార్థులకు అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. తుఫానులు, భూకంపాలు వచ్చినప్పుడు, వరదలు వచ్చినప్పుడు ఏ విధంగా రిస్క్ చేసి బాధితులను కాపాడాలో తెలియజేశారు. ఈసందర్భంగా జాలయ్య మాట్లాడుతూ విద్యార్థులు అగ్ని ప్రమాదాలపై అవగాహన పెంచుకుంటే అకస్మాత్తుగా తమ ప్రాంతాల్లో జరిగే అగ్ని ప్రమాదాల నష్టాన్ని తగ్గించవచ్చన్నారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు..

పెద్దదోర్నాల: అగ్నిమాపక వారోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా అగ్నిమాపక సిబ్బంది ఆదివారం మండల కేంద్రంలోని అగ్ని మాపక కేంద్రంలో ముగింపు కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి శ్రీరంగా మల్టీస్పెషాలిటీ వైద్యురాలు లావణ్య, డాక్టర్ కాశీరావులు హాజరై ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదాలు చోటు చేసుకున్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో స్టేషన్ ఫైర్ ఆఫీసర్ హరిబాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆటో యూనియన్ ప్రెసిడెంట్‌గా నరేంద్రరెడ్డి


ఆటో యూనియన్ ప్రెసిడెంట్‌తో ఆటో డ్రైవర్లు

దొనకొండ: మండల ఆటో యూనియన్ ప్రెసిడెంట్‌గా పిచ్చాల నరేంద్రరెడ్డిని ఆటో యూనియన్ డ్రైవర్లు ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నరేంద్రరెడ్డి మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా కృషి చేస్తానన్నారు. అందరం కలిసి మెలిసి యూనియన్‌గా ఉండాలని నరేంద్రరెడ్డి ఆటో డ్రైవర్లను కోరారు.

గుంటిగంగా భవానీ అమ్మవారికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

తాళ్లూరు: మండలంలోని తూర్పు గంగవరం పంచాయతీ పరిధిలోని సోమవరప్పాడులో ఉన్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రం గుంటిగంగా భవానీ అమ్మవారికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారులు మెట్టేల బాలరాజు, పి. విజయలక్ష్మి మూల విరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. అలయ బ్రాహ్మణ అర్చకుడు కామేశ్వరశర్మ అమ్మవారికి అభిషేకాల, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అమ్మవారికి నైవేద్యాలు, కానుకలు సమర్పించారు. జిల్లాలోని అనేక ప్రాంతాల నుంచి భక్తులు తీర్చే కల్పవల్లిగా పిలువబడే అమ్మవారిని సందర్శించడానికి పెద్ద సంఖ్యలో వచ్చారు. భక్తులు జంతువులను బలి ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం పక్కన ఉన్న పుట్ట, నాగశిలలను భక్తులు, మల్లికార్జున స్వామి వారిని పూజించారు. ఆలయ ఈవో జి.వాసుబాబు, చైర్మన్ కే గురుబ్రహ్మం, ఏఆర్ ప్రసాద్ సిబ్బంది భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయాన్ని పర్యవేక్షించారు.

ఆలయాల్లో భక్తులు విశేష పూజలు


ప్రత్యేక అలంకరణలో కాటమరాజుస్వామి

పెద్దారవీడు: మండలంలో గుండంచర్ల గ్రామం సమీపంలో నల్లమల అడవిలో వెలసిన గంగాభవానీ వేనూతల కాటమరాజుస్వామి, పెద్దారవీడు గ్రామం సమీపంలో వెలసిన అంకాళమ్మ దేవత, ఎస్ కొత్తపల్లి గ్రామం సమీపంలో వెలసిన శ్రీనాగాంజనేయస్వామి పుట్టకు భక్తులు భక్తిశ్రద్ధలతో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. కాటమరాజుస్వామి, గంగ భవానీ దేవతకు అభిషేకాలు, కుంకుమార్చన, పూజలు చేసి పట్టువస్త్రాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు అంకాళమ్మ దేవతకు మహిళలు పసుపు, కుంకుమ, చీరలు, గాజులు, నాగమయ్యపుట్టకు పాలు, పండ్లు సమర్పించారు. అంకాళమ్మ దేవతను పట్టువస్త్రాలు, అభరణాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని, కాయకర్పూరం సమర్పించి, మొక్కులు చెల్లించారు.

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన బోధన


తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

ముండ్లమూరు (కురిచేడు): విద్యార్థులను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని హెచ్‌డబ్ల్యూ ప్రధానోపాధ్యాయురాలు కే శారద అన్నారు. మండల కేంద్రం ముండ్లమూరు లోని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు ఆదివారం ఇంటింటికీ తిరిగి విద్యార్థులను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు సీహెచ్ శ్రీచ్ లలితా కిరణ్, అంగన్‌వాడీ కార్యకర్త మంజుల వాణి విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ర్యాలీ

యర్రగొండపాలెం: వక్ఫ్ సవరణ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం పట్టణంలో ముస్లింలు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించనున్నట్లు జమియతుల్ ఉలుమా ఐక్యవేదిక తెలిపింది. ఉదయం 10 గంటలకు స్థానిక బస్టాండ్‌కు సమీపంలోని నూరాని మజీద్ వద్ద నుంచి శాంతియుత ర్యాలీ ఉంటుందని, ముస్లింలు, మేధావులు ఈ ర్యాలీలో పాల్గొనాలని ఆ వేదిక కోరింది.

వైభవంగా చెన్నకేశవుని బ్రహ్మోత్సవాలు


ప్రత్యేక అలంకరణలో లక్ష్మీ చెన్నకేశవస్వామి వారు


తిరునాళ్ల సందర్భంగా కళారూపాల ప్రదర్శన

మార్కాపురం: మార్కాపురం లక్ష్మీ చెన్నకేశవస్వామివారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. స్వామివారి ఉత్సవాలను తిలకించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొంటున్నారు. మార్కాపురం పట్టణంతోపాటు వేములకోట, చింతగుంట్ల, తిప్పాయిపాలెం, గజ్జలకొండ, కొండేపల్లి, శివరాంపురం, రాయవరం, పెద్దారవీడు, తర్లుపాడు, దేవరాజుగట్టు, గొబ్బూరు తదితర ప్రాంతాల నుంచి ప్రజలు తరలివస్తున్నారు. రెండు రోజులుగా స్వామివారికి హనుమంత వాహనం, గరుడోత్సవం, గజవాహనం సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, కళారూపాలు అలరిస్తున్నాయి. స్వామివారి ఉత్సవాలు తెల్లవారుజామున 4 గంటల నుంచి ప్రారంభమై ఉదయం 9 గంటల వరకూ కొనసాగుతున్నాయి. పట్టణమంతా సందడి వాతావరణం నెలకొంది. తిరునాళ్ల సందర్భంగా బంధుమిత్రులందరూ మార్కాపురానికి రావడంతో వీధులన్నీ కళకళలాడుతున్నాయి. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన దుకాణాలతో సందడిగా ఉంది. ఉదయం పూట జరుగుతున్న ఉత్సవాల్లో వేల సంఖ్యలో భక్తులు స్వామివారి వాహనాన్ని మోస్తూ జై చెన్నకేశవా... జైజై చెన్నకేశవా.. అంటూ ముందుకు సాగుతున్నారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో అన్నదానాలు, అల్పాహారాలు, మంచినీటి సౌకర్యం, మజ్జిగ ప్యాకెట్లు భక్తుల కోసం ఏర్పాటు చేశారు.


విద్యుత్ కాంతులతో స్వామివారి ఆలయం

రథోత్సవానికి ఏర్పాట్లు:

భూదేవీ శ్రీదేవీ సమేతుడై స్వామివారు సోమవారం సాయంత్రం రథంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. సుమారు 50 వేలకు మందికిపైగా భక్తులు పాల్గొనవచ్చని అంచనా. వివిధ స్వచ్ఛంద, ధార్మిక సంస్థల ఆధ్వర్యంలో దర్శనం కోసం వచ్చే భక్తులకు పలు ప్రాంతాల్లో అన్నదానాలు చేయనున్నారు. మార్కాపురం డీఎస్పీ డాక్టర్ నాగరాజు ఆధ్వర్యంలో 200 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీఐ సుబ్బారావు తెలిపారు. డివిజన్‌లో 12 మంది ఎస్సైలు, ముగ్గురు సీఐలు, ఏపీఎస్పీ కానిస్టేబుల్స్, స్పెషల్ పార్టీ పోలీసులు బందోబస్తులో పాల్గొంటున్నారు.